# భీతి

శ్రీ కె. ఎస్. వి. నరసింహమ్

అన్నం సయించడం లేదు.

మజ్జిగ కలుపుకున్నాడు. అతి కష్టమ్మీద ముద్దలు మింగుతున్నాడు. ఊహూఁ—వల్ల కాలేదు.

'అన్నమంతా వదిలేశారేమండీ—'

సుబ్బారావు చేయి కడుక్కుని తువ్వాలుతో చేతులు తుడుచుకుంటున్నానన్న ధ్యాసలేకుండా తుడుచుకున్నాడు.

చెంతలో గాజుల చప్పుడైతే గ్లాసందుకుని నీళ్ల త్రాగాడు.

*

* *

పడగ్గది కిటికీ—చిన్నదికాదు. పడగ్గది చిన్నది కాదు. అది వేసవికాదు.

కాని,

సుబ్బారావుకు గాలిలేనట్లు తోచింది. ప్రపంచం యిరుకై యిరుకై తనను ఊపిరి సలపనీకుండా చేస్తున్నట్టనిపిస్తోంది. అంత చల్లని రాత్రికూడా—మండుటెండలో ఒయాసిస్సుల్లేని ఎడారిలో కాళ్లు విరిగి పడిపోయినట్టు కూడా అనిపిస్తోంది.

పడగ్గది గుమ్మంలో అలికిడి.

'ఇంకేమైనా కావాలా?—'

సుబ్బారావుకు అనుమానంగా ఉన్నట్టుంది. అనుమానం—పడగ్గది పైకప్పు దభేల్మని ఎందుకు కూలిపోలేదని కావచ్చు, అనుమానం—తను హఠాత్తుగా కూచున్నవాడు కూచున్నట్టే (మంచంతోసహా) పాతాళ లోకాలకెందుకు దిగబడిపోలేదని కావచ్చు.

ప్రక్కనే గాజులు చప్పుడౌతున్నాయి.

(మెషీన్లు తాంబూలాలు వేసుకుంటాయా? మనకి తెలీదు. కాని-) సుబ్బారావు మెషీన్లాగ నోటి కందుతూన్న తమలపాకు చిలకల్ని నములుతున్నాడు.

సుబ్బారావు ఆవేళ విచిత్రంగా ఉన్నట్టు కనిపించకుండా వుండాలని ప్రయత్నిస్తున్నట్టు కనబడుతున్నాడు.

ప్రక్కనే పొడిదగ్గు వినిపించింది.

సుబ్బారావు తాంబూలపు రసం మింగి మళ్లీ చివరి చిలక నములుతున్నాడు. సుబ్బారావుకి బహుశా ఆశ్చర్యంగా ఉన్నట్టుంది—కిటికీ అవతల కనిపిస్తూన్న నగరం మంటల్లో లేదేమా అని! (అతనొక 'నీరో' కాదు; కాలేదు అనికూడా అతనికి తెలుసునులా ఉంది.)

పడగ్గదిలో లైటు ఆరిపోయింది.

(మెషీన్లకు 'చీకటి వెలుతురూ' భేదాలుంటాయా?—మనకి తెలీదు, బహుశా మరో జగదీశ్ చంద్రబోస్ నడగాలి. కాని, మెషీన్లకి చీకటంటే భయమా?) సుబ్బారావు పసివాడు కాడు. అతనికింతకు ముందెప్పుడూ చీకటంటే భయం ఉణ్ణింది కాదు.

ప్రక్కనే చీకటిలోంచి గాజుల గలగలైంది.

(పడగ్గది తూర్పుగోడ గూట్లో చిన్నఅలారం టైంపీసుంది. చీకట్లో దాని అంకెలు మెరుస్తాయి. చిన్నపిల్లలకి అది గుడ్లురిమి చూసేట్టు అనిపిస్తుంది.) గూట్లో ఉన్న గడియారం కళ్ళకి సుబ్బారావు ముఖంలో ఏం జరుగుతోందో కనిపించలేదు.

ప్రక్కనే ఉండి ఇంతసేపూ గలగలమని సవ్వడి చేసిన గాజులు చల్లగా గుండెలమీద కెగ్రబాకాయి.

అవి మరీ పైకొచ్చి మరీ మధురంగా మ్రోగి, మెడ వెనుక ఆగి; రెండు చేతుల గాజులూ—అక్కడ కలిసి మ్రోగి క్షణం కిలకిల మన్నాయి.

(మెషీన్లు సంగీతం వింటాయా? — మనకి తెలీదు. కానీ, మెషీన్లు ఒక రకమైన సంగీతం సృష్టిస్తాయని మన మెరుగుదుము. కొన్ని చప్పుడు చెయ్యని మెషీన్లున్నాయి. సంగీతంపట్ల వీటి అభిప్రాయమేమిటో?—ఏ పత్రికా విలేఖరి అడుగుతాడు?) సుబ్బారావు హృదయంలో ఏవో చప్పుడైనట్లు ఎవరో విన్నారు. ఎవరు? బహుశా — ఆ గదిలోని చీకటి కావచ్చా? బహుశా—ఆ గదిగోడ వినివుండవచ్చా? లేక, చీకటివంటి గోడవంటి జీవి(?) కావచ్చా?

మెడ వెనకగాజులు చేరితే—సుబ్బారావు చేతులకు ఏం లభించింది?

(మెషీన్లపై మత్తుమందు పనిచేస్తుందా? ఏమో—మనకి తెలీదు)

* * *

లోకంమీద ఉదయం వాలింది.

కిటికీ ప్రక్కన కూర్చుని సిగిరెట్టు కాల్చుకుంటున్నాడు సుబ్బారావు. అతను చాలా సేపట్నుంచి అక్కడే కూచుని ఉన్నాడు.

ఆఫీస్‌కి టైం కావొస్తున్నాదని అతనికి తెలీనట్టు కూచున్నాడు.

ఆ గదిలోకి కాంతమ్మ ఇదివరకే ఏ తొమ్మిది పదిసార్లో వొచ్చి తొంగిచూసి వెళ్ళివుంటుంది.

ఆమె రాకపోకలు గమనించినట్టే లేదు సుబ్బారావు.

చేతిలో సిగిరెట్టుని చివ్వరిసారిగా పీల్చి పీకని కిటికీగుండా అవతలికి పారేశాడు.

కాని, ఎందుకో ఆ పారెయ్యడం అతనికే అతి కృత్రిమంగా అనిపించింది.

ఏదో పాపపు చిహ్నాన్ని పారేసినట్టనిపించింది.

ఎందుకనిపించింది ?

సుబ్బారావు గదిలోంచి బయటపడబోయాడు. అంతలో కాంతమ్మ గుమ్మంలో ఎదురుపడింది.

ఎవరో ఆజ్ఞాపించినట్టు తలవంచుకుని ఇవతలికి వచ్చెయ్యబోయాడు సుబ్బారావు.

'ఏమండీ—' అంది కాంతమ్మ. ఆమాటే అంది. కాని, ఆమె 'ఆగ'మని కూడా అన్నట్టు అతను ఆగిపోయాడు.

అతని కళ్ళలోకి సంశయాన్నీ, అతని నుదుటిమీదికి ముడతల్నీ, అతని పెదవులకు వేదన పోలికల వొంపునీ యిచ్చి వొక్కనిమిషం గడిచిపోయింది.

కాంతమ్మ అంది.

'లంచం తీసుకోకండి—మనం ఇన్ని దినాలూ మంచిగా బ్రతికాం— మనం మంచిగా బ్రతికి చెడిపోలేదు. చెడ్డతో డబ్బు తెచ్చేసుఖం — అది మనస్సుకి సుఖం కావచ్చు—కాని, ఆత్మకు సుఖంకాదు ... లంచం తీసుకోకండి...నేను మీకు చెప్పవలసినదాన్ని కాను. కాని— లంచం— తీసుకోకండి— మన మంచికోసం—'

సుబ్బారావు నేల చూపులు చూస్తున్నాడు. (ఇది పాత పలుకుబడే కావచ్చుగాని,)

ఎందుకు చూస్తున్నాడు?

'ఈనేల ఎందుకు పటేల్ పటేల్‌మని తెగిపోవడం లేదు?— ఈనేల నన్నేల మింగెయ్యడం లేదు?—' అనుకుంటూన్నట్టు చూస్తున్నాడు.

గాజులచెయ్యి మళ్ళీ అతని గుండెల్ని కప్పింది.

'ఏమండీ...'

'..........'

'కోపం వొచ్చిందా?'

దించిన తల దించినట్లే ఆమె ఎత్తిన కన్నుల లోకి చూశాడు.

'అనంతాంబరంపు నీలినీడ'లలో దారి ఏదో తెలిసొచ్చింది.

'రాత్రి అంతా ఎంత కలవరించారని ... బిల్లు ... బిల్లు... వందరూపాయలు... ఇంకా ఏమి టేమిటో అన్నారు.

సుబ్బారావు చూడడం లేదు. కాని, దృశ్యం కనిపిస్తోంది. సుబ్బారావు వినడంలేదు. కాని, మాటలు వినిపిస్తున్నాయి.

'నన్ను క్షమించండి...'

అని అంటున్నట్టు లీలగా వినిపించింది.

సుబ్బారావు చలించిపోయాడు.

సుబ్బారావు పెదవులు 'కాంతం...కాంతం...' అని ఏదో గొణిగి ఆపైన బలం చాలనట్టు ఊరు కున్నాయి.

కాని, ఆమె నడుమును చుట్టిన అతని చేతి వ్రేళ్ళు విపరీతంగా వణికాయి, మామూమ్మాలు వణుకు కాదు. చెడుత్రోవని వెళ్ళిపోబోయిన మనస్సు మళ్ళీ మంచి త్రోవలో కాలుపెట్టినప్పుడు కలిగే ఆనందం వలని వణుకు !

